# తుఫాను బాధితుడు

పోకలరామలక్ష్మి




**బాల్కనీలో** పచార్లు చేస్తున్న బంగార్రాజు దృష్టి మేడమీంచి హఠాత్తుగా ఎదురుగా ఉన్న ఓ వస్తువుమీద పడి నిశ్చలంగా, ఆశ్చర్యంగా నిలిచి పోయింది.

ఆ వస్తువు అనబడే గుడి సెకు నాలుగువైపులా తడికెలుమీదను నాలుగు తాటి మట్టలు ఉన్నాయ్. ఇన్నాళ్ళూ ఆ ఖాళీ జాగా ఎవరి దృష్టినీ ఆకర్షించలేదు. అంత ఎందుకు? మూ డంతస్తుల మేడమీద రూఫ్‌గార్డెన్‌లా ఏర్పాటు చేసుకున్న డాబామీద రోజూ పచార్లు చే సే బంగార్రాజుక్కూడా ఆ స్థలంమీద దృష్టి ఆనలేదు ఇప్పటివరకు. అదో పోరంబోకు స్థలం. ఓ అయిదారు గజాలమేరకు కంకర. అడవితుప్ప కూడా దట్టంగా ఉంది తప్ప మరో లాభంలేదు. ఆపైనుంచి ఏదో ఆఫీసు కాలనీ కనిపిస్తుంది. బంగార్రాజుగారి పొరుగులలో మాత్రం వరసగా షావుకార్లకు, భూకామందులకు నివాసయోగ్యాలైన అంతస్తు భవనా లున్నాయి.

అక్కడక్కడ ఆ భవనరాజాల ధనిక స్తంభాలను ఆధారం చేసుకుని జీవిద్దామని కాబోలు పాదతీగల్లాంటి పూరి గుడి సెలు మధ్య మధ్యలో ఇరుక్కుపోతూ కనిపిస్తాయి.

ఈ రోజుల్లో అందరూ అనుకున్నట్టు డబ్బున్నవాడైనా, బంగార్రాజు చెడ్డవాడేమీ కాదు. అతనికి ఎన్నెన్నో గొప్పపనులు చెయ్యాలని ఉంటుంది. త్యాగాలు చెయ్యాలని తహతహగా ఉంటుంది. కాని, చే సేలోగా ఏవో అవాంతరాలు వచ్చి పడుతుంటాయి. అందు కతని సందేహాలే కారణం.

తమ ఇంట్లో చాలా రోజులుగా నమ్మకంగా పనిచేస్తూ, ఇచ్చిన జీతం డబ్బులకంటే ఎక్కువ కాయకష్టాన్ని ధారపోస్తున్న వెంకమ్మకు ఒకసారి సాయం చేయాలనుకున్నాడు బంగార్రాజు. ఒక ఇల్లు కట్టించి ఇవ్వాలని అతని ఆశయం. అంతలో పెనుభూతంలా వచ్చింది ఒక అనుమనం. వెంకమ్మ మరీ ముసలిదేం కాదు. దాని కో పదహారేళ్ళ కొడు కున్నాడు. వాడు ప సివాడుగా ఉన్ననాడే మొగుడు చనిపోగా రెక్కలు విరుచుకుంటోంది వాడికోసం.

ఇవాళ అయాచితంగా తను సాయంజే స్తే లోకం ఏమని కూస్తుందో ఊహించడం కష్టం కాదు. ఒకవేళ తన భార్యకే అనుమానం వచ్చిందా ఇక అడవులు పట్టిపోవడమే అని బంగార్రాజు కిక్కురు మనకుండా ఆ ఆలోచనకి స్వ స్తి చెప్పాడు.

ఒకనా డతనికి తమ పొలాల్లో పనిచే సే పెద్ద పాలేరు గుర్తొచ్చాడు. డబ్బున్నవాడు దానం చేయాల్సిందే అని ఏ హరిదాసో బంగార్రాజుకి బాగా వంటపట్టించాడు. ఎంత డబ్బున్నా, దాన ధర్మాలు చేయనివానికి అధోలోకాలు తప్పవని బంగార్రాజుకి అనిపించి ఉండవచ్చు.

పాలేరు కొడుకు పదో క్లాసు చదువుతున్నాడట అని పాలేరే ఎప్పుడో చెప్పాడు. ఈసారి బంగార్రాజు గట్టిగా తీర్మానించుకున్నాడు. ఆ పాలేరుకి కొడుకును చదివించుకోవడం తలకుమించిన పని అయి ఉండాలి. సంపదకి తక్కువైనా, సంతతి కేమీ తక్కువలేదు అతగాడికి. నెలకు వంద రూపాయల చొప్పున సహాయంగా, ఉచితంగా ఇ స్తే బ్రహ్మాండంగా ఉంటుంది అని నిశ్చయించుకున్నాడు ఆయన.

దరిద్రుడు తల కడిగితే వడగళ్ళ వానట. పాలేరు రాత బావులేదని తేలింది. అనుకోకుండా బంగార్రాజు కూతురు కో సంబంధం వచ్చింది. రావడమే కాక, కుదిరి పెళ్ళి పది రోజుల్లోకి వచ్చింది.

సరిగ్గా అప్పుడే పెద్ద పాలేరుకి పెద్దోళ్ళని ఏడ్పించా లనిపించింది. తన కాళ్ళు పట్టుకుంటారో, లేదో చూద్దామని పాలేరు పని మానుకున్నాడు. బంగార్రాజు భార్య వరలక్ష్మి పాలేరుని విశ్వాసఘాతుకుడని తిట్టింది. వాడు కాకుంటే మరోడు వస్తాడని ధీమాగా చెప్పింది. ఆ విషయంలో బంగార్రాజుక్కూడా నిబ్బరమే. అయితే, తన పరోపకారబుద్ధి బయటపడే దెప్పుడో అతనికి తెలియడంలేదు.

ఆలోచనల్లోంచి తెలివి తెచ్చుకుని కొత్తపాక వైపుగా చూశాడు. ఏదైనా ప్రాణి ఉన్న అలికిడి అక్కడేమీ కనబడలేదు. 'హుష్ ఈ పోరంబోకు స్థలంలో ఎవరైనా గొడ్లు కట్టుకోవడానికి పాక వేసుకొన్నారేమో' అనుకొని మెట్లుదిగి వెళ్ళిపోయాడు బంగార్రాజు.

మర్నాడు చుక్కలు పొడుస్తున్న సమయంలో మేడమీద కొచ్చేడు. అతడి కళ్ళు మొదటగా కొత్త పాకవైపు పరుగుతీశాయి. పాకముందు ఒక ప్రాణి

మెదుల్తోంది. పాకముందు చింకిచాపే పట్టె మంచంగా. గూట్లో గుడ్డిదీపమే జీవనజ్యోతిగా నక్షత్రదీపాలే ఆశాజ్యోతులుగా. పిల్లగాలే తోడునీడగా బోర్లపడి పడుకొని ఉన్నాడు—గడ్డంకింద ముంజేయి ఆనించుకొని.

'ఓహో! ఈ శాల్తీయా?' అన్నట్టు బంగారాజు పరిశీలించాడు.

మనిషి ఎవడోగాని బక్కవాడే. జుత్తు నున్నగా దువ్వుకున్నాడంటే దువ్వెనా, అద్దమూ ఉన్నాయని అనుకోవాలి. శాంతంగా ఉన్నాడే. కోపంగ ఉన్నాడో పరిశీలించాడు. ఆలోచనగా ఉన్నాడు. ఇటువంటివాడు తప్పకుండా పెద్దపనే ఏదో చేస్తాడు.

కొన్నాళ్ళు చూసి ఈ మనిషి కేమైనా సహాయం చేయాలని అనుకున్నాడు మామూలుగానే.

అది అలా ఉండగా బంగారాజు భార్య వరలక్ష్మి పనిమనిషికోసం తెగ వెదుకుతున్నది. అసలే పెళ్ళిరోజు దగ్గర పడ్తోంది. పనిమనిషి అంటే పని కొంచంకూడా తనలో దాచుకోకుండా అంతా పూర్తిగా చేసే పనిమనిషని ఆవిడ అభిప్రాయం.

అనుకోకుండా ఆవిడ దృష్టికూడా ఓరోజు కొత్త పాకమీద, ఆ పాక తాలూకు కొత్త మనిషిమీద పడింది.

వెంటనే ఆ మనిషిని పిలిపించింది. ఆ మనిషి పనిమనిషిలానో. కూలి మనిషిలానో కన్పించడంతో మరేం సంకోచపడలేదు వరలక్ష్మి. "ఏమోయ్! మా ఇంట్లో పంజేస్తావా?"

"ఏం పనమ్మా?" అని అడుగుతాడని ఆశించిందామె.

"ఒక రింట్లో పనులుజేయటం నాకు అలవాట్లేదమ్మా!" అన్నాడు కొత్త మనిషి ఎంతో వినయంగా.

'ఓరి—నీ కెంత పొగర్రా!' అనుకొంది వరలక్ష్మమ్మ. అట్నించి నరుక్కొద్దామని-"ఈ ఊళ్ళో నిన్ను చూసినట్టు లేదే! ఏ ఊరబ్బాయ్ నీది?" అనడిగింది.

"చీరా లండి!"

'చీరాలో, పేరాలో నా కెందుగ్గాని' అనుకొంది లోపల. "అయితే, మీ ఇంట్లో కాయకష్టంజేసే వాళ్ళెవళ్ళూ లేరా?"

"లేరండి!"

"అన లెవరూ లేరా?"

"లేరండి!"

"పది రూపాయలు ఇస్తా. గిన్నెలు తోమి, బట్టలుతికి, ఇళ్ళు తుడిచి, నీళ్ళు తోడి..."

"తప్పకుండా వెదుకుతానమ్మా ఎవరైనా మనిషిని! ఇంక సెలవు పుచ్చుకుంటున్నా. నమ్మగారు!" వినయంగా నమస్కరించాడు.

ఎప్పుడు అతను వెనుదిరిగాడో చూడనంత ఆశ్చర్యాగ్రహాల్లో మునిగిపోయింది వరలక్ష్మి. "హుఁ!" అని నిప్పులు కక్కి దాన్ని ఎవరిమీదో దులపరించడానికి తొందరపడుతుండగా బంగారాజు ఎదురయ్యాడు.

ఇంతలో ఈ ఘోరవిపత్తు సంభవించి తన, ఉపకార కార్యక్రమానికి గొడ్డలిప్రేటు అవుతుందని అనుకోని బంగారాజు స్థితి వర్ణనాతీతం.

×× ×× ××

బంగారాజు ఆ కొత్త మనిషి పేరు రంగయ్య అని తెలుసుకోవడమే కాకుండా అతనికి ఎలా అయినా గుప్తదానంలా ఏదైనా సహాయం చేయాలనే నిశ్చయాని కొచ్చేశాడు.

రంగయ్య మనసు తెలుసుకోవడం ముఖ్యం. తను ఇచ్చే దానాన్ని పుచ్చుకుంటాడో, లేదో కూడా అనుమానాస్పదమే. భార్య వివరణ విన్న తర్వాత అతడు నిక్కచ్చి మనిషీ, నిజాన్ని నిర్భయంగా చెప్పేవాడూ అయితే చాలా తంటాలు పడాలి. భార్య కీ విషయం తెలిస్తే బతకనివ్వదని ఎలాగా తెలుసు బంగారాజుకి.

లోకులు పలుగాకులు. ఏ వింతయినా పరులలో పంచుకొనందే ఊరుకోరీ కాకి మూకలు.

సందుమొదలో జనసందోహం లేనిచోట రంగయ్యకోసం ఎదురు చూడసాగాడు బంగారాజు. ఆ, సమయంలో సోడా తాగేందుకు బజారు కెళ్ళడం రంగయ్య అలవాటు.

అనుకున్నట్లుగానే రంగయ్య సోడా తాగేతంతు ముగిసింది. అందుకోసం కాచుకున్న బంగారాజు—చుట్టుపక్కల పెద్దమనుషు లెవరూ లేకుండా చూసుకొని రంగయ్య పక్కగా అడుగు వేశాడు.

"అబ్బాయ్!" అని పిలిచాడు.

వింతగా చూశాడు రంగయ్య. "ఏంటండి, బాబూ! నేను చిన్న అబ్బాయి నేం కానండి" అన్నాడుగూడా.



నవ్వుకున్నాడు బంగార్రాజు. "తెలును లేవోయ్! మాఇంటి ఎదురుగా ఉన్న స్థలంలో పాక వేనుకున్నావు నువ్వే కదూ?" అనడిగాడు ప్రశం ిస్తున్నట్టు.

"అవునండి. ఆ స్థలం మీదా, బాబూ! అయితే, అయిదో పదో అద్దె కట్టుకుంటా—"

"నాది కాదు. కాని, నిన్ను చూడగానే నాకు చాలా అభిమానమూ, బాధా కలిగాయి. అభిమాన మెందు క్కలిగిందోగాని, బాధ మాత్రం నువ్వు వంటరిగా ఉన్నందుకే! నీ పేరు రంగయ్యని మా ఆవిడ చెప్పింది. ఆవి డేదో నిన్ను పని చెయ్య మందట. ఆవి డేదో అందని ను వ్వేమీ అనుకోకు. పనులు చే సేవాళ్ళు ఉంటారు! చెయ్యకపోనూ వచ్చు...అయితే, నువ్వు నే ననుకున్నట్టే ఒంటరివా డివేనా? తో డెవరూ లేరా?"

"నాకు తోడు పైనున్న భగవంతుడు. నా రెక్కలు చూశారా?...ఈ రెక్కల్లో శక్తి. అంతే, బాబు గారూ!"

"అందుకే—అందుకే, రంగయ్యా! నీ కెలాగైనా ఏదైనా సహాయం చేయాలనుంది... నీ కే అవసరం వచ్చినా నన్ను ఒక్కడినీ కల్సుకో. ఏ సహాయం కావాలంటే అది చేస్తాను."

"గొప్పోరిలో తప్పబుట్టినట్టున్నారు, బాబూ, మీరు! కాని, నేను నా కంటే పెద్దోరి దగ్గర సహాయం అడగను; పుచ్చుకోను. నాకంటె చిన్నోళ్ళు అడక్కుండా సాయం చేస్తానండి. అది నా పద్ధతి. వెళ్ళొస్తా, బాబు! నమస్కారం. దయ ఉంచండి."

బంగార్రాజు స్థాణువయ్యాడు. మెల్లగా నడిచి ఇల్లు చేరుకున్నాడు.

కాని, రంగయ్యకి తన సహాయం తప్పకుండా కావల్సి వస్తుంది అనుకున్నాడు. అవకాశం కోసం నేను ఎదురుచూడాల్సిందే అని నిట్టూర్చాడు.

×× ×× ××

నిరాశ చెందిన బంగార్రాజుకి రంగయ్యమీద కోపం వచ్చింది. ఆ కోపం రంగయ్యకి ఏదైనా శా స్తి జరగాలని అతనికే తెలియనంత గుట్టుగా కోరిందేమో కూడా. కాని, బంగార్రాజు భార్య బహిరంగంగానే తిట్టిపో ిసింది. "వాడిల్లు మూ ద్రోజుల్లో కూలిపోకపోతే నా పేరు వరలక్ష్మీ కాదు. నేను పతివ్రతనీ కాను" అంటూ నిప్పులు కురి సేలా చూ ిసింది.

ఇంతలో బంగార్రాజుగారి అమ్మాయి బంగారమ్మకి పెళ్ళి వైభవంగా జరిగిపోయింది. పెళ్ళికొచ్చినవాళ్ళే సర్వం చూసుకోవడంతో పనిమనుమల కొరత వరలక్ష్మికి తెలియలేదు. పెళ్ళి పనులతో బరువెక్కిన బంగార్రాజు మెదడుకి ఇంకో విషయం ఆలోచించడానికి కనీసం నెలరోజులైనా పట్టింది.

హఠాత్తుగా ఓ రోజు ఆయనకి రంగయ్య పాక ముందు ఎర్రమట్టి కుప్పలు కనిపించాయి. వాటిని చూస్తూనే తెల్లబోయాడు. 'నేను చే సే సహాయం అక్కర్లేకపోయింది. ఎర్రమన్నా అమ్ముకుంటున్నవు!' అని మనసులోనే అనుకున్నాడు.

ఆ తర్వాత ఎవరు చెప్పారో బంగార్రాజుకి —రంగయ్య పందుం పుల్లలు, కట్టెపుల్లలు కూడా అమ్ముతున్నాడని. పెట్టుబడి లేని వ్యాపారాలు చాలా చాలా చేస్తున్నాడనీను. పట్నవాసంలో కొత్తగా చేరిన పల్లెటూరివాళ్ళ కోసమా పందుం పుల్లలు.

ఇక రంగయ్య వాలకం ఏమాత్రం గమినించినా మట్టికొట్టుకున్నట్టుండే కట్టెలమ్ముకునేవాడిలా ఉండ డసలు. దీని భావమేమి శ్రీనివాసా? అని పలుమార్లు ప్రశ్నించుకుంటూ ఉన్నాడు. పైగా ఈ మధ్య చాలా నీటుగా కన్పిస్తున్నాడు అతగాడు. అసూయ కుండతో వరలక్ష్మి గుండె దహించుకుపోయింది.

×× ×× ××

వరలక్ష్మి వాక్శుద్ధి ప్రభావమో, దుర్భిక్ష ఫలిత మోగాని ఆమె శాపనార్థాలు ఫలించినట్టే—ఊరూ ఏరూ ఉన్నట్టుండి ఏకమైనాయి. ఉప్పెనను తలపింపజేస్తూ ఊళ్ళు జలమయమయినాయి. ఆమె ప్రాతివ్రత్యానికి పది పెట్టి గుణించినట్టు రంగయ్య గుడి సే కాక, పేదవాళ్ళ కొంపలన్నీ వరదల్లో కొట్టుకుపోయి మనుమలు మాత్రం మిగిలారు.

బంగార్రాజు రంగయ్య గురించి బాధపడ్డానని అనుకున్నాడు. మనసు మారుమూలల్లో ఎక్కడో అతనికి తగిన శా స్తి అయింది అంటున్నట్టు అతనికి వినపడలేదు. ఇకపోతే వరలక్ష్మి సంతోషానికి పట్టపగ్గాల్లేవు.

ఆమె ఆనందసాగరానికి ఆనకట్ట పడిందా అన్నట్టు ఓ వార్త వినవచ్చింది.

అప్పుడప్పుడే కూలిన పిడకలను లేవనెత్తుకుంటూ జనం పడరాని పాట్లు పడుతున్నారు. గాలిలో దీపాలు ఆరిపోతున్నాయి. ఆకలి కడుపులు కళ్ళల్లో ప్రతిఫలిస్తుంటే, శరీరాలు జోగుతునయి. కూడు ముఖ్యమా నీడ ముఖ్యమాఅన్నట్టుంది అప్పటి పరి ిస్థితి.


# వాయువు ప్రకోపించిందా?
# గేస్ట్రోజెన్
## వెంటనే ఉపశమనం ఇస్తుంది





Manufactured by
MANGALAM PHARMACEUTICALS & LABORATORIES
Coimbatore 641 011
Mfg. Lic. No. 123

మీరు ఏటి పేటితోనైనా అవస్థపడుతున్నారా?
• హైపర్ ఏసిడిటీ • అజీర్తి వాయు ప్రకోపము • తేన్పులు • మలబద్ధకము • ఆకలి లేకపోవడం • ఒక్కొక్కప్పుడు కడుపు ఉబ్బటం • మత్తుగా వుండటం • అలసట • ఆయాసం • బద్ధకం • ఆందోళన • భోజనం చెయ్యగానే కడుపులో మంట • వెంట వెంటనే మల విసర్జన చెయ్యాలని అనిపించడం • మలంలో శ్లేష్మం • వాంతులు • వికారం • రుచిలేక పోవడం • ఉక్కిరి బిక్కిరి అయినట్టు అనిపించడం • పక్కలనా, కీళ్ళలోనూ బాగా నొప్పి • కడుపు క్రింది భాగంలో బరువుగా ఉండటం • కడుపు వాచడం • అసహాయతగా అనిపించడం • రక్తం లేక పాలిపోవడం • శ్లేష్మం వల్ల గుండెలో పట్టడం • దగ్గు • శారీరంగా అలసిపోవడం మొదలైనవి. "గేస్ట్రోజెన్" యీ బాధలన్నింటికి చికిత్స చేస్తుంది. ఇది చురుకుగా పనిచేసే 'ఆయుర్వేదపు' మందు. ఇది పౌడర్, కాప్సూల్ యీ రెంటిలోనూ దొరుకుతుంది.

గేస్ట్రోజెన్
మందుల దుకాణాలు అన్నిట్లోనూ దొరుకుతుంది.

స్టాకిస్టులు మరియు డిస్ట్రిబ్యూటర్లు:
హైదరాబాద్: మెస్సర్స్ జ్యోతి మెడికల్ హాల్, నెం.28, మహాత్మాగాంధిరోడ్, సికిందరాబాదు3 ఫోన్: 74293. మెసర్స్ ప్రకాష్ మెడికల్ హాల్ ఖజామియా బజార్, హైదరాబాదు. మెసర్స్ కైదురా మెడికల్ హాల్, మంగల్‌హాట్, హైదరాబాద్. మెసర్స్ సన్‌దీప్ మెడికల్ స్టోర్సు, హైదరాబాదు. విజయవాడ: మెసర్స్ రియల్ కెమిస్ట్స్, టవున్. పార్క్ రోడ్, విజయవాడ—1. ఫోన్: 73220. మెసర్స్ శ్రీ తిరుమల మెడికల్ స్టోర్స్, మెయిన్ రోడ్, మండపేట. విశాఖపట్నం: మెసర్స్ రియల్ కెమిస్ట్స్, నెం. 1. టున్‌పార్క్ రోడ్, విజయవాడ—1. ఫోన్: 73220. హిందుపురం: మెసర్స్ శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, 7, శ్రీ రామా బిల్డింగ్స్, హిందుపురం, ఆం. ప్ర. ఫోన్. 548. మెసర్ వెంకటేశ్వర ఏజెన్సీస్, 13, బి. వి. కె. అయ్యంగార్ రోడ్, బెంగుళూరు—560 053, ఫోన్: 74207 మెసర్స్ విజయా మెడికల్ ఏజెన్సీస్, హిందుపురం. మెసర్స్ ప్రకాష్ మెడికల్ ఏజెన్సీస్, కర్నూలు.




బంగార్రాజులాంటి షావుకార్లు చందాలు ఎత్తి ఒకరోజు ఆ ఊరి వరదబాధితులకు అన్నం పెట్టారు. పాతబట్టలు పంచిపెట్టడం జరిగింది.

రంగయ్య ఏం చేస్తున్నాడా అని చూశాడు. తన కొంపమాట కూడా మరచి, సాటివారి గోడ నిలబెడ్తూ ఉన్నాడతను.

రంగయ్య ఇకనైనా బుద్ధి తెచ్చుకుని తన సహాయాన్ని అర్థిస్తాడు అనుకున్నాడు బంగార్రాజు. ఇప్పటికైనా బుద్ధి వచ్చి పని ఇప్పించమని వస్తాడనుకుంది వరలక్ష్మి. ఇద్దరి ఊహల్ని తలకిందులు చేస్తూ రంగయ్య ఏ గొప్పవాణ్ణీ అర్థించలేదు సరికదా, పేదవాళ్ళ ప్రతినిధిగా నిలబడి వారితోపాటు ప్రభుత్వ సహాయాన్ని తన వాటా కూడా అందుకున్నాడు. ఈసారి ప్రభుత్వం పేదల బ్రతుకులకు సరిపోయే ఇళ్ళను నాలుగు నెలల గడువులోనే కట్టి ఇచ్చింది. అంతేగాదు. కొంపలు తుడిచిపెట్టుకుపోయినవారికి ఒక్కో కుటుంబానికి రెండు వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. ప్రకటించిన కొద్ది రోజుల్లో అందేటట్లు కూడా చర్యలు తీసుకున్నారు ప్రభుత్వంవారు.

ఈ వార్తే వరలక్ష్మి గుండెల్లో గునపంలా దిగితే, బంగార్రాజుని సూదిలా బాధించింది.

"చూశారా! చూశారా! గడ్డిపోచ లేకుండా వచ్చి ఎంత సంపాయిస్తున్నాడో?...ఏ మంత్రితోనైనా చెప్పండీ-వాడి దీవూరు కాదని, ఇదివరకు కొంపాగోడు ఏదీ ఇక్కడలేని దొంగెదవనీ..."

భార్య తన మనసునే చదువుతున్నట్టనిపించింది బంగార్రాజుకి. 'అవును. రంగయ్య గర్వానికి తగినట్టు—ప్రభుత్వ సహాయానికి అతడు అనర్హుడనీ, కూలిన ఇళ్ళల్లో ఇల్లంటూ ఏదీ లేదని పెద్ద బుర్రలకు వర్తమానం అందిస్తేనో?'

అంతలో బంగార్రాజు వణికిపోయాడు. తను పరోపకారం చేయాలనుకుంటూ పరాపకారిగా మారిపోతున్నాడు. హత బుద్ధీ!

వీరి భావాలతో పనిలేని కాలచక్రం గిరగిరతిరిగిపోసాగింది. రంగయ్య మొదట కట్టెల వ్యాపారి. తర్వాత అడితీ యజమాని. తర్వాత చిల్లర వస్తువుల వ్యాపారస్తుడు అయ్యాడు. కొన్నాళ్ళకు నిత్యావసర వస్తువులన్నీ తెప్పించాడు. రంగయ్య లోపాయికారిగా చేసే పనులు ఎవరికీ అర్థమయ్యేవి కావు. అతను చౌకగా అమ్మి ప్రజాభిమానం సంపాదించి, తర్వాత డబ్బు సంపాదించాడు. టోకుగా తెచ్చి చిల్లరగా అమ్మి లక్షలు గడించాడన్నారు జనం.

"రంగయ్య ఇంకో ఇల్లు కడుతున్నాడండీ!"

తనకే చూచాయగా తెలిసిన సంగతి తన పెళ్ళాంకి రూఢిగా ఎట్లా తెలిసిపోయిందా అని బంగార్రాజు ఆశ్చర్య పడ్డాడు.

"అవునటే!—ఒకే ఒక బ్రహ్మాండమైన హాలు కట్టిస్తున్నాడు. సినిమాహాలు చేస్తాడేమో—చాలా గుట్టుగా ఉన్నాడులే మనిషి."

రంగయ్య చాలా ఎదిగిపోయాడు. అతనెవరో ఎవరికీ అక్కర్లేదు. డబ్బొకటీ, పేరొకటీ చాలు.

×× ×× ××

అన్ని ఉదాయాల్లాగే ఆరోగంటకంతా లేచి కూర్చున్నాడు ముఖప్రక్షాళనకి. అదయింతర్వాత అలా అలా కాలక్షేపం చేస్తుండగా ఇంతలో గగ్గోలు విన్పించి అటు చూశాడు.

రంగయ్య రంగయ్య అనే మాటలు అస్పష్టంగా అతని చెవుల్ని తాకాయి.

చర్రునలేచి పైన కండువా వేసుకుంటూ బయటకు నడిచాడు బంగార్రాజు.

జనం ఒక్కొక్కరే వింత చూడడానికి ఆత్రపడుతున్న మొగాలతో ఊరి పొలిమేరలోని రంగయ్య కొత్త నిర్మాణం కేసి నడుస్తున్నారు. అతను వాళ్ళను వెంబడించాడు.

విశాలమైన హాలు పూర్తి అయి నిండుగా కన్పిస్తుంది. ఎత్తు తక్కువగా ఉన్న ఆ హాలు గోడలు దృఢంగా ఉన్నాయి. కాని, రంగులు హంగులు లేవు. తలుపులు మూసి తాళాలు వేసి ఉన్నాయి. పైన నల్లబోర్డు ఒకదాని మీద తెల్లని అక్షరాలు పెయింటు చేయబడ్డాయి. ఇలా రాసి ఉంది.

"ఈ విశాలమైన హాలు తలుపులు విరగగొట్టి లోపలికి ప్రవేశించే హక్కు తుఫాను పెట్టిన సమయాల్లో కొంపాగోడులేని వారికి మాత్రమే ఉంది. ధనికులకు ప్రవేశం లేదు."

రంగయ్య ఆ బాధ్యత తనకి అప్పగించినట్లు ఓ పెద్ద మనిషి రంగయ్య గురించి చెప్పుకొస్తున్నాడు అక్కడ. అతని కథనం ఇలా ఉంది.

తుఫానుకు తరుచుగా గురయ్యే ఒకానొక ప్రాంతపువాడు రంగయ్య. ఒకసారి ఆ ప్రాంతం తుఫానును తీవ్రంగా ఎదుర్కొంది.

అనుకోకుండా ఒక బయలు స్థలంలో చిక్కుకున్నారు ధనికవర్గంవాళ్ళు. దిక్కు తోచలేదు. తుఫాను గాలులు ఎడాపెడా కొడుతున్నాయి. అంతలో ఆశాజ్యోతిలా ఆ తోటలో దూరంగా ఒక రేకుల షెడ్డు కన్పించినది. తోటమాలి నివాసం కోసం కొత్తగా కట్టించిన షెడ్డు. ఒకే పరుగులో అక్కడికి చేరుకున్నారు. వాళ్ళ ప్రాణాలు తెరిపిపడ్డాయి.

కొంత సేపటికి లోపల సిగరెట్టు పొగలు అలుముకున్నాయి. వేరే విలాసాలకు అవకాశాల్లేవు.

ఇంతలో తలుపుమీద దబదబ చప్పుడు. తుఫాను హోరు ఎక్కువై ప్రకృతి భయానకంగా తయారైంది.

"ఎవరది"? అరిచాడొకడు.

"మేం, బాబు. తోటమాల్ని... ఈళ్ళంతా మావోళ్ళే! కొంపాగోడూ ఎగిరిపోతుంటే పరిగెట్టుకొస్తుండాం. తియ్యండి, బాబూ, వాన కొట్తాంది." జాలిగ ఉన్న మాటలు. తొందరపడ్తున్న గొంతులు.

లోపలి శాల్తీ జవాబు చెప్పలేదు.

ఇవతలి గొంతుకలు అర్చాయి. గీ పెట్టాయి. చించుకున్నాయి. అయినా జవాబులేదు. లోపల నవ్వులు, కేరింతలు.

ఇవతలున్నవారు ఉద్రేకంతో ఊగిపోయారు.

తలుపులు బద్దలు కొట్టడమే తరువాయి. పిడికిళ్ళు పిడుగులుగా మారాయి. అంతలో అనుకోని సంఘటన. షెడ్డు వెనుకగా ఉన్న కొబ్బరి చెట్టు నిలువునా షెడ్డుమీద కూలిపోయింది—దాన్ని కూడా కూల్చేస్తూ. కొన్ని సెకన్లు హాహాకారాలు చెలరేగాయి. లోపలివారు పూర్తిగా నలిగిపోయారు. కొంతమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. బయట ఉన్నవాళ్ళు బ్రతుకు జీవుడా అని మరోచోటు వెదుక్కుంటూ పరుగెట్టారు.

ఇంతకూ రంగయ్య ఏ వర్గంవాడు?

ధనికవర్గంవాళ్ళు లోపలకు దూరకముందే షెడ్డులోపల ఉన్న తోటమాలి దూరపు బంధువు అతను. కొద్దిగా చదువుకున్నవాడు.

అందుకనే ఈ విశాలమైన హాల్లోకి ఎట్టి విపత్కర పరిస్థితి ఎదురైనా-"ధనికులకు ప్రవేశం లేదు"

బంగార్రాజు ఆలోచనలు ఇంకా ముందుకుపోయాయి. రంగయ్య ఎక్కడికో వెళ్ళిపోయాడా? అతను ఎక్కడికో మరో తుఫాను దెబ్బ ఎదుర్కోడానికే వెళ్ళాడని అనుమానంగా ఉంది బంగార్రాజుకి. *